నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 30 డిసెంబర్ 2024 | HYDERABAD


## ఔషధాలు సీజ్

సిటీబ్యూరో: అర్హత లేకుండా వైద్యం చేయడమే కాకుండా యాంటిబయోటిక్ వంటి ఔషధాలు విక్రయిస్తున్న ఒక నకిలీ క్లినిక్‌పై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో నకిలీ వైద్యుడిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.47వేల విలువైన ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన మజిగి మనోహర్‌లాల్ జాజీపూర్ జిల్లాలో ఎలాంటి అర్హత లేకుండానే క్లినిక్‌ను నిర్వహించడమే కాకుండా వచ్చిన రోగులకు యాంటిబయోటిక్స్ వంటి మందులు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు క్లినిక్‌పై దాడులు జరిపి అనుమతి లేని రూ.47వేల విలువైన 50 రకాల ఔషధాలను సీజ్ చేశారు. అర్హత లేకుండా వైద్యం చేస్తున్న మనోహర్‌పై కేసు నమోదు చేశారు. మరో కేసులో మహబూబాబాద్ జిల్లాలో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న సిద్ధార్థ ఫార్మసీపై దాడులు జరిపారు. అధిక ధరకు విక్రయిస్తున్న తియోహిల్ జెల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో నిబంధనలకు విరుద్ధంగా జ్వరం, ఆస్తమా వంటి సమస్యలను నయం చేస్తుందనే లేబుళ్లతో కూడిన ఔషధాలు విక్రయిస్తున్న రాష్ట్రంలోని మేడ్చల్-మల్కాజిగిరి, చైతన్యపురి, సరూర్‌నగర్, ఎర్రగడ్డ, నిజామాబాద్, బోధన్, మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ఆయుర్వేదిక్ ఫార్మసీలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో పెద్ద ఎత్తున చికిత్స పేరుతో ప్రకటనలు ముద్రించి ఉన్న ఔషధాలను సీజ్ చేశారు.

## రూ.2కోట్ల విలువైన డ్రగ్స్ దహనం



సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): నగరంలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో పట్టుబడిన రూ.2కోట్ల విలువైన డ్రగ్స్‌ను ఆబ్కారీ అధికారులు దహనం చేశారు. ఆబ్కారీ ఈడీ వి.బి.కమలాసన్ రెడ్డి కథనం ప్రకారం హైదరాబాద్ యూనిట్‌లోని నారాయణగూడ, సికింద్రాబాద్, అమీర్‌పేట, చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో నమోదైన 59 కేసుల్లో పట్టుబడిన 240 కిలోల గంజాయి, 496 కిలోల ఎండీఎంఏ, హాశీశ్ ఆయిల్ తదితర మత్తు పదార్థాలను రంగారెడ్డి జిల్లాలోని జీజే మల్టీక్లాడ్ ప్రై.లి.లో దహనం చేశారు. ఈ డ్రగ్స్ విలువ రూ.2కోట్లకు పైగా ఉంటుందని ఈడీ వెల్లడించారు.

# ప్రైవేట్‌కు పారిశుధ్య నిర్వహణ

## 64.40 కిలోమీటర్ల కారిడార్లలో స్వీపింగ్ పనుల అప్పగింతకు ఏర్పాట్లు




చిలుకానగర్‌లో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు

### ఏటా ఖజానాపై రూ. 24కోట్ల ఆర్థిక భారం

### ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ) : మూలిగే నక్కపై తాటిపండు పడిందన్న చందంగా..అప్పుల ఊబిలో కూరుకుపోయిన జీహెచ్‌ఎంసీ ఖజానాపై మరింత ఆర్థిక భారం మోపే నిర్ణయాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సంస్థ రూ. 6530కోట్ల అప్పులకు రోజు వారీ మిత్తి రూ. కోటికి పైగా చెల్లింపులు జరుపుతున్నారు. ప్రతి నెల 1వ తేదీ వచ్చిందంటే చాలు జీతభత్యాలు, పెన్షన్లు చెల్లించేందుకు ఆర్థిక విభాగం నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలోనే పారిశుధ్య నిర్వహణను ప్రైవేట్‌పరం చేసి మరింత భారం మోపేందుకు శానిటేషన్ విభాగం రంగం సిద్ధం చేసింది. పర్యాటక ప్రాంతాలు, వీవీఐపీ/వీఐపీలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల పారిశుధ్య నిర్వహణను 73 కిలోమీటర్ల మేర రహదారులను అప్పగించారు. 24 గంటలూ స్వీపింగ్ జరిగేలా మెకిలిన్, ఇక్సోరా కంపెనీలకు ఈ బాధ్యత అప్పగించారు. ఇందుకుగానూ కిలోమీటర్‌కు సగటున నెలకు రూ.3.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వాస్తవంగా ఇదే పనిని కార్మికుల స్వీపింగ్‌కు నెలకు అయ్యే వ్యయం రూ.40వేలు మాత్రమే. కార్మికులతో పోలిస్తే ప్రైవేట్‌కు చెల్లిస్తున్నది ఎనిమిది రేట్లు అధికం. ఈ క్రమంలోనే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేట్ విధానంపై తీవ్ర స్థాయిలో అరోపణలు వస్తుండగా, తాజాగా అధికారులు మరో 64.40 కిలోమీటర్ల మేర కారిడార్లను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇదే జరిగితే సంస్థపై నెలకు రూ. 2 కోట్ల చొప్పున ఏటా రూ. 24కోట్ల ఆర్థిక భారం పడనున్నది. గతంలోనే అప్పగించిన రోడ్లకు ప్రస్తుతం ఏటా రూ. 22.46 కోట్లు చెల్లిస్తున్నారు. ఇక నుంచి ఈ మొత్తం రూ. 47 కోట్లకు పెరగనున్నది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సంస్థకు ఈ నిర్ణయం మరింత అదనపు భారమే అని చెప్పాలి.

### వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

దేశ, విదేశీ సందర్శకులు రానున్న దృష్ట్యా పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని, వీవీఐపీలు, వీఐపీలు రాకపోకలు సాగించే మార్గాల్లో చెత్తా చెదారం కనిపించవద్దని 24 గంటల స్వీపింగ్‌కు ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. 27 టూరిస్ట్ ప్రాంతాలు, 73 కిలోమీటర్ల మేరలోని చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, మక్కా మసీదు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాలను ఇక్సోరా కార్పొరేట్ సర్వీస్ ప్రై.లి శానిటేషన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సదరు ఏజెన్సీ గడిచిన కొన్నేండ్లుగా ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ బాధ్యతలను చేపడుతున్నది. రోజుకు మూడు సార్లు స్వీపింగ్ (చెత్త ఊడవడం నుంచి ఎత్తివేసే ప్రక్రియ వరకు), ప్రత్యేక సిబ్బంది, సూపరవైజర్లతో కలిసి శానిటేషన్ నిర్వహిస్తున్నారు. తాజాగా, సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలోని 64.40 కిలోమీటర్ల పరిధిలోని కారిడార్లను ఏజెన్సీలను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల తాజా నిర్ణయంపై కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మికుల పొట్ట కొట్టే విధానాలను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాయి.

# నేరాల అడ్డాగా నగరం

- రెండు కమిషనరేట్లలో భారీగా పెరిగిన క్రైమ్‌రేట్
- నేరాల కట్టడిలో పోలీస్ సిబ్బంది తడబాటు
- కొరవడిన జవాబుదారితనం..
- నిర్వహణ లేక పనిచేయని అనేక సీసీ కెమెరాలు
- నేరగాళ్లను పట్టుకోలేని పరిస్థితి
- విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలంటున్న నగరవాసులు



సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే హైదరాబాద్, సైబరాబాద్‌లో అధిక నేరాలు నమోదయ్యాయి. అదే రాచకొండ కమిషనరేట్‌లో సైకిల్ పెట్రోలింగ్, నిర్మానుష్య ప్రాంతాల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించడంతో రెండు కమిషనరేట్ల కంటే తక్కువగానే నేరాలు నమోదయ్యాయనే వాదన వినిపిస్తున్నది. హైదరాబాద్‌లో రాత్రి వేళల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు పెరిగిపోవడం, హత్యలకు కూడా దొంగలు తెగబడిన ఘటనలు ఉన్నాయి. సరైన సమయంలో పెట్రోలింగ్ పోలీసులు స్పందించలేదని.. విజిబుల్ పోలీసింగ్ లేకపోవడంతో సెల్‌ఫోన్ స్నాచర్లు రెచ్చిపోయారనే ఆరోపణలు వస్తున్నాయి. అదే కోవలో సైబరాబాద్‌లోనూ అధికంగా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు విడుదల చేసిన వార్షిక నివేదికలో సైబరాబాద్‌లో 64%, హైదరాబాద్‌లో 41%, రాచకొండలో 4% నేరాలు పెరిగినట్లు వెల్లడైంది.

### వచ్చే ఏడాదైనా గాడిలో పడుతుందా..

మొదటి సంవత్సరం భారీగా నేరాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. వచ్చే ఏడాదైనా శాంతి భద్రతలు గాడిలో పడుతాయా? అని నగర వాసులు చర్చించుకుంటున్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తూ..విజిబుల్ పోలీసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే.. నేరాలు తగ్గించేందుకు అవకాశముంటుందని సూచిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సిబ్బంది కూడా సిటీ పోలీసింగ్‌పై పట్టు తెచ్చుకోవాలని.. ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ నేరాలను తగ్గించేందుకు నిరంతరం ప్రయత్నిస్తే..ఉత్తమ ఫలితాలు వస్తాయంటూ ప్రజలు సూచనలు చేస్తున్నారు.

### నేరం జరిగితే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బిజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశారు. ప్రతి పెట్రోలింగ్ వాహనం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించేది. ఆయా పెట్రోలింగ్ వ్యవస్థ పర్యవేక్షణను నిరంతరం ఐటీ సెల్ నుంచి పరిశీలించారు. పోలీసులు ఎక్కువగా బయట కనిపిస్తుండటంతో దొంగతనాలు చేసేవారు... ఇతర నేరాలు చేసేవారిలో భయం అనేది ఉండేది. ఏం చేసినా పోలీసులకు దొరికిపోతామనే భయం ఆయా నేరగాళ్లలో ఉండేది. దీంతో చాలా వరకు నేరాల సంఖ్య తగ్గిపోయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి 8 నెలల పాటు వ్యవస్థ అంతా అస్తవ్యస్థంగా మారింది. తరచూ అధికారులను మారుస్తూ క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందనే విషయాన్ని కూడా పట్టించుకోలేని పరిస్థితి నెలకొన్నది. కిందిస్థాయి సిబ్బందిలో జవాబుదారితనం కొరవడింది. అంతర్రాష్ట్ర ముఠాలు తిరిగి హైదరాబాద్ వైపు రావడం మొదలుపెట్టాయి. లక్షలాది సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయాయి. కెమెరాల నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా వరకు కెమెరాలు పాడయ్యాయి. నేరం జరిగితే వెంటనే నేరగాళ్లను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

# నార్త్ సిటీపై ఏం చేద్దాం ?

## ప్రభుత్వ ఆదేశాల కోసం హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎదురుచూపులు

సిటీబ్యూరో: నార్త్ హైదరాబాద్‌కు అత్యంత కీలకమైన మెట్రోపై హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. రెండో దశ విస్తరణలో భాగంగానే నార్త్ సిటీ మెట్రోను నిర్మించాలనే డిమాండ్ పెరుగుతూ ఉండగా, ఫేస్-2 ప్రాజెక్టుపై ప్రభుత్వం కీలక ప్రకటన చేయనున్నదంటూ మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి ఓ సమావేశంలో ప్రకటించారు. దీంతో నార్త్ సిటీ మెట్రో విషయంలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కాగనార్త్ సిటీ ప్రతిపాదనలు లేకుండానే డీపీఆర్ కేంద్రానికి చేరగా, అనుమతులు రావడమే ఆలస్యం అన్నట్లుగా చూస్తున్నారు. కానీ రెండు నెలలుగా ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ సమయంలోనే నార్త్ సిటీ వరకు మెట్రో తప్పనిసరిగా నిర్మించాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం కూడా ఈ విషయంలో పునరాలోచన చేస్తున్నదని, సానుకూలమైన నిర్ణయంతో ఫేస్-2పై ప్రకటన చేస్తుందని భావించారు. డిసెంబర్ 30న జరిగే క్యాబినెట్ ఏజెండాలో పెట్టాలంటూ నగరవాసులు కోరారు. కానీ క్యాబినెట్ సమావేశం వాయిదా పడటంతో... ఈ విషయం మరింత సంక్లిష్టంగా మారింది. నార్త్ సిటీ మెట్రోను రెండో దశలోనే చేపట్టాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇటీవల మెట్రో ఫేస్-2 విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేసింది. ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే నార్త్ సిటీ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఫోర్త్ సిటీ, షాద్ నగర్ వరకు మెట్రో విస్తరిస్తామని ప్రకటించడంపై ఆ ప్రాంత జనాలు తీవ్ర అసహనంతో ఉన్నారు. ఫేస్-2లోనే నార్త్ సిటీ వరకు మెట్రో విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఆదేశిస్తే మెట్రో పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు హెచ్‌ఎంఆర్‌ఎల్ వర్గాల ద్వారా తెలిసింది.

# మధ్యాహ్న భోజనం వండేదెలా..?

- నెలలుగా పెండింగ్‌లో బకాయిలు
- ఆందోళనలో భోజన ఏజెన్సీ కార్మికులు
- మధ్యాహ్న భోజన పథకంపై సర్కారు నిర్లక్ష్యం



పెండింగ్ బిల్లులను విడుదల చేయాలంటూ.. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు(ఫైల్)

మేడ్చల్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): మధ్యాహ్న పథకం భోజన పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. దీంతో నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి.. మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాల్సిన పరిస్థితి మధ్యాహ్న భోజన కార్మికులకు ఏర్పడింది. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అప్పుల పాలవుతున్నట్లు భోజన కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చేసిన వాటికే బిల్లులను విడుదల చేయకుండా విద్యార్థులకు వండి పెట్టాలని ఒత్తిడి తేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

### అనేక బిల్లులు పెండింగ్..

భోజన ఏజెన్సీలకు అనేక బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. ఒక్కో ఏజెన్సీకి సుమారు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు రావాల్సి ఉంది. అంతేకాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలని, ప్రసుత్తం మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7 ఉంటే ప్రభుత్వం మాత్రం ఇచ్చేది రూ. 4.25 ఇవ్వడం వల్ల మరింత నష్టపోతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం తక్షణమే అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పెండింగ్ బిల్లులపై ఇటీవలే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద భోజన ఏజెన్సీ కార్మికులు ధర్నా చేసిన క్రమంలో పెండింగ్ బిల్లులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు విడుదల కాలేదని కార్మికులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం మధ్యాహ్న భోజన పథకంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడం మూలంగా ఇలాంటి పరిస్థితి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెండింగ్ బిల్లుల విడుదలకు సంబందించి ప్రభుత్వంతో పాటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### 507 సర్కారు పాఠశాలల్లో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుండగా అమల్లో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సక్రమంగా నిధులు విడుదల చేస్తే కార్మికుల ఇబ్బందులు తొలగడమే కాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం లభించే అవకాశముంటుంది. మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే వంట సరుకులకు సొంత డబ్బులతో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అనంతరం నెల తర్వాత కొనుగోలు చేసిన సరుకులకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. అయితే మూడు నెలలుగా బిల్లులను విడుదల చేయకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# కొత్త ఏడాదిలోనైనా ప్రారంభిస్తారా?

- నిర్మాణంలోనే కొత్వాల్‌గూడ ఎకో పార్క్
- ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అందుబాటులోకి రావాల్సి ఉన్నా.. ఇంకా కొనసాగుతున్న పనులు
- సిటీకి తలమానికంగా నిలిచే ప్రాజెక్టుపై సర్కారు నిర్లక్ష్యం



సిటీబ్యూరో, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌లో ఇంకా నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా భారీ ఐవరీ, అక్వేరియంతో దాదాపు 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ పనులను చేపట్టారు. 2023 అక్టోబర్ నాటికి 70 శాతానికి పైగా పనులు పూర్తవ్వగా, శాసనసభ ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. మిగిలిపోయిన కొన్ని పనులకు ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ వరకు అనేకసార్లు టెండర్లు కూడా పిలిచారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచింది. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. కనీసం కొత్త ఏడాదిలోనైనా పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి పనులన్నీ కూడా తుది దశకు చేరుకున్నాయి. అయితే కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి గల కారణాలపై పలు విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చ జరిగింది. దీంతో ఎట్టకేలకు స్పందించిన హెచ్‌ఎండీఏ అధికారులు.. పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. మహానగరంలోని జంట జలాశయాలకు సమీపంలో ఉన్న ఎకో టూరిజం పార్క్‌ను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

### పర్యాటకానికి అత్యంత కీలకం..

హైదరాబాద్ పర్యాటకానికి వన్నె తెచ్చే ఈ ప్రాజెక్ట్‌ను భారీ వ్యయంతో చేపట్టారు. పచ్చని పరిసరాలు, అతిపెద్ద పక్షిశాల, అక్వేరియంతోపాటుగా వినోద కేంద్రంగా తీర్చిదిద్దారు. కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు గుర్తింపు వస్తున్నది. ఐవరీ, అక్వేరియం, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాపింగ్ వంటి సదుపాయాలతో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ముఖ్యంగా నగరానికి తలమానికంగా నిలిచే ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలోనే ఉండటం, జంట జలాశయాలను కూడా చూసే వీలు ఉండటంతో ఈ ప్రాజెక్టు పర్యాటకానికి అత్యంత కీలకంగా మారనున్నది.కానీ ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ అధికారులు పనులను పూర్తి చేసేందుకు జాప్యం చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే అందుబాటులోకి రావాల్సిన ఈ పార్క్...కొత్త ఏడాది వస్తున్నా.. పనులు ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయి.